క్లుప్తంగా

మద్యం సిట్టింగ్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవు

పిట్లం(జుక్కల్): దాబా హోటళ్లలో సిట్టింగ్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్సై వెంకట్రావ్ హెచ్చరించారు. ఎస్సై మాట్లాడుతూ..పిట్లంలోని దుర్గాభవాని దాబాలో ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం సిట్టింగ్ నిర్వహించినందున దాబా యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఎవరూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం విక్రయించరాదన్నారు.

సౌత్‌క్యాంపస్‌లో ప్లేస్‌మెంట్లు

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రసాయన శాస్త్రం అభ్యసించిన వారికి భిక్కనూరు, చేగుంటలో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరడానికి సౌత్‌క్యాంపస్‌లో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, ఎంఎస్ఎన్ కంపెనీ ప్రతినిధి వెంకటనారాయణ, సౌత్‌క్యాంపస్ రసాయన శాస్త్ర అధ్యాపకులు నాగరాజు, సాయిలు, సంగీత, నిరంజన్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

మైక్ సెట్ బహూకరణ

భిక్కనూరు: కాచాపూర్‌లోని హనుమాన్ ఆలయానికి ట్రాక్టర్ యూనియన్ ప్రతినిధులు మంగళవారం మైక్ సెట్‌ను బహూకరించారు. గ్రామస్తులందరికి భక్తి గీతాలను వినిపించేందుకు ఆలయానికి మైక్ సెట్‌ను అందించినట్లు ట్రాక్టర్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలకు ఫర్నిచర్ అందజేత



బీబీపేట: మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎం.పెరమాండ్లు.. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 15 కుర్చీలు, 2 బీరువాలు, 2 ర్యాకులు, 5 టేబుళ్లు, ఫ్యాన్లను మంగళవారం కళాశాల అధ్యాపకులకు అందజేశారు. అడిగిన వెంటనే కళాశాలకు అవసరమైన వస్తువులు ఇప్పించినందుకు పెరమాండ్లుకు ధన్యవాదాలు తెలిపారు. జూనియర్ కళాశాల సాధన సమితి సభ్యులు సంతోష్ గౌడ్, దేవరాజు, కళాశాల ప్రిన్సిపల్ అఖిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎల్లారెడ్డి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ధోబి గల్లీలో కాలనీవాసులకు తడి ,పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం కాలనీ వాసులతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, తదితరులున్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ మహేష్ ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు.

వ్యాధి నివారణ టీకాలను వేయించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు తమ ఆవులకు తప్పనిసరిగా లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి రమేష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పశువైద్యశిబిరం ఏర్పాటు చేసి ఆవులకు టీకాలను వేశారు. వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మండల స్థాయి క్రీడలు

దోమకొండ: మండల కేంద్రంలో మంగళవారం మండల స్థాయి క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గడికోటలో పోటీలను గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలానికి చెందిన 10 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మండల విద్యాధికారి విజయ్ కుమార్, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంతో పాటు గాంధారీ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీవీఎం, పీడీఎస్‌యూ, బీడీఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో ఎస్.రాజుకు వినతి పత్రం అందజేశారు. అనుమతి లేకుండా, అధిక ఫీజులు వసూలు చేస్తూ, మౌలిక వసతులు లేకుండా కొనసాగిస్తున్నారని డీఈవోకు వివరించారు. విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న నల్ల రామారెడ్డి మండలంలోని మోషన్‌పూర్ గ్రామ ఎస్సీ కాలనీలో ఉంది. ఈ నల్లా నుంచే నీళ్లు తెచ్చుకొని తాగడానికి ఇతర పనులకు వినియోగిస్తున్నారు. మోషన్‌పూర్ గ్రామంలో దాదాపు 80 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయి. ఎస్సీ కాలనీలో రెండు పెద్ద ట్యాంకులు ఉన్నా ఆ ట్యాంకుల్లో చుక్క నీరు రాక చుట్టూ చెట్ల పొదలు అపరిశుభ్రత మధ్య ఉన్న నల్ల నుంచి నీళ్లు తెచ్చుకోక తప్పడం లేదని.. రోగాల బారిన పడుతున్నామని ఎస్సీ కాలనీవాసులు వాపోతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న నీటి కుండీ పోసానిపేటలో ఉంది. అపరిశుభ్రంగా పాకురు పట్టిన నీళ్లలోనే గ్రామస్తులు బట్టలు ఉతుక్కోవడం.. ఇళ్లకు కావలసిన నీటిని తీసుకెళ్తున్నారు. కనీసం కుండీ నీళ్లలో ఇంతగా పాకురు పట్టి ఉన్నా గ్రామపంచాయతీ సిబ్బంది పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పంచాయతీల్లో పాలనపై పర్యవేక్షణ కొరవడిందని చెప్పడానికి ఈ ఫొటోనే నిదర్శనం.

పంచాయతీల్లో పర్యవేక్షణ కరువు

- కార్యదర్శుల హాజరుపైనా అనుమానాలు
- పేరుకే ప్రత్యేక అధికారులు.. గ్రామాలను పట్టించుకోని వైనం
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ.. రోడ్లపై ప్రవహిస్తోన్న మురికి నీరు



పోసానిపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు



మోషంపూర్ ఎస్సీ కాలనీలో నీళ్లు లేక ఖాళీగా ఉన్న ట్యాంకులు

రామారెడ్డి: సర్పంచులు లేకపోవడంతో ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది విధులకు సకాలంలో హాజరుకావడం లేదని ఇటీవల ఫేక్ అటెండెన్స్‌తో మోసం చేసి అధికారులకు దొరికినట్లుగా తెలిసింది. ఆ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు సైతం జారీ చేసినట్లు సమాచారం. కామారెడ్డి జిల్లాలో 532 జీపీలు ఉండగా అన్ని గ్రామాల్లో పల్లె పాలన పడకేసింది.

వర్షాకాలంలోనూ మంచినీటి కష్టాలు..

నిధులు రావడం లేదని సాకుతో అధికారులు ఎవరూ గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో సమస్యల తీవ్రత మరింత పెరిగింది. రోడ్లపైనే మురికి నీరు ప్రవహిస్తోంది. గ్రామాలలో నిర్మించిన మంచినీటి కుండీల్లో పాకురు పట్టినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అవే నీళ్లు ప్రజల వినియోగిస్తుండడంతో డెంగీ వంటి వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కొన్ని గ్రామాల్లో ఆరు నెలలు గడిచినా డ్రైనేజీని శుభ్రం చేయడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకే డ్రైనేజీ శుభ్రమైందని చెబుతున్నారు. వర్షాకాలంలోనూ మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడం, సింగిల్ ఫేజ్ మోటార్లు కాలిపోవడంతో మంచి నీటి తిప్పలు తప్పడం లేదు. అలాగే గ్రామ పంచాయతీలలో ఉన్న బాడీ ఫ్రీజర్లు రామారెడ్డి మండల వ్యాప్తంగా ఏ గ్రామ పంచాయతీలోనూ పనిచేసిన దాఖలాలు లేవు. వాటి రక్షణను సంబంధిత అధికారులు మర్చిపోయారు. వృథాగా పడి ఉంటున్నాయి. ప్రభుత్వం పంచాయతీల బాధ్యతను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. అయినా ప్రత్యేక అధికారులు నామమాత్రంగా మారారు.

కార్యదర్శి పట్టించుకోవడం లేదు



ఎస్సీ కాలనీలో మంచి నీరు రావడం లేదు. ఎన్నిసార్లు కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదు. అపరిశుభ్రత మధ్య ఉన్న నల్లా నుంచే ఎస్సీ కాలనీ ప్రజలంతా నీళ్లు తెచ్చుకుంటున్నారు. కనీసం దోమల మందును స్ప్రే చేయడం లేదు. ఇటీవల నా కొడుకుకు డెంగీ సోకింది. అధికారులు స్పందించాలి. – క్షౌరం రాజేందర్, మోషంపూర్

సమస్యల పరిష్కారానికి కృషి



మండలంలోని పలు గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. మోషంపూర్ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తాను. – నాగేశ్వరరావు, ఎంపీడీవో, రామారెడ్డి

నూతన సంఘాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఈ నెల 30లోగా గ్రామాల్లో నూతన సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మంగళవారం లింగంపేట సెర్ప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సంఘాల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సంఘాల్లో లేకుండా మిగిలిపోయిన మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏర్పాటు చేసిన సంఘాల వివరాలు సెర్ప్ కార్యాలయంలో అందజేయాలన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో నూతనంగా ఐటీఐ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఐటీఐ పోస్టర్లను ఆవిష్కరించారు. అదనపు డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఎంపీడీవో నరేష్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య, డీపీఎం సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు చొప్పున ఐటీఐలో చేర్పించండి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రతి గ్రామం నుంచి ఐదుగురి చొప్పున ఐటీఐ కాలేజీలో చేర్పించాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. ఆయన మంగళవారం తాడ్వాయి ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించారు. సీసీలు, మహిళా సంఘాల సభ్యులు, వీవోఏలు సిబ్బంది అందరూ కలసి గ్రామాలలో పర్యటించి.. ఐటీఐ కాలేజీలో చేరడం వల్ల కలిగే లాభాల గురించి వివరించాలన్నారు. 10తరగతి చదివిన వారిని ప్రతి గ్రామం నుంచి ఐదుగురి చొప్పున కాలేజీలో చేరేలా చూడాలన్నారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, సీసీలు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకున్న మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మంగళవారం ఆయన మోతె గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ స్వరాజ్యం సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు రాయితీపై కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుట్టు మిషన్లు పొందిన మహిళలకు ఉపాధి అవకాశం లభించినట్లు తెలిపారు. ఒక్కో మహిళ మరో ఇద్దరికి ఉపాధి కల్పించాలన్నారు. రూ.15 వేలు విలువ చేసే కుట్టు మిషన్‌ను రూ.7,300లకు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రమాదకరంగా గుంత



నస్రుల్లాబాద్: అంకోల్ గ్రామ అంగన్‌వాడి సెంటర్ ముందు కల్వర్టుపైన గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అంగన్వాడిలో చిన్నారులు నిత్యం ఈ మార్గంలో నడుస్తూ ఉంటారు. ద్విచక్ర వాహనాలు తిరుగుతూ ఉంటాయి. కల్వర్టు మధ్య నుంచి ఇనుప సలాకాలు బయటకు వచ్చి ప్రమాదంగా ఉన్నాయి. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

భూభారతిలో ఇచ్చిన దరఖాస్తులు ఎక్కడ?



గాంధారి(ఎల్లారెడ్డి): భూసమస్యల పరిష్కారం కోసం ఇటీవల భూ భారతి గ్రామ సభల్లో తాము ఇచ్చిన దరఖాస్తులు ఎక్కడున్నాయని సీపీఎం కామారెడ్డి జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ ఆధ్వర్యంలో పలువురు రైతులు రెవెన్యూ అధికారులను మంగళవారం ప్రశ్నించారు. మండల పరిధిలోని మాతు సంగెం శివారులో గల సర్వే నం.119, 175లో 60 ఎకరాల ప్రభుత్వ భూమిని 45 మంది దళిత, గిరిజన పేద రైతులు సాగు చేస్తూ జీవనం సాగించేవారు. ఆ భూమిని కొందరు భూస్వాములు పేద రైతులను బెదిరించి అక్రమంగా పామ్ ఆయిల్ తోటలు ఇతర పంటలు సాగు చేస్తున్నారని, ఇదే విషయాన్ని గ్రామంలో ఇటీవల నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేశామన్నారు. ఆ దరఖాస్తులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మాయమయ్యాయని ఆరోపించారు. అధికారులు విచారణ చేసి పేదల భూములను ఇప్పించాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతి పత్రం ఇచ్చారు.

డీజే వద్దు.. డప్పు ముద్దు



పిట్లంలో మాట్లాడుతున్న ఎస్సై వెంకట్రావు

పిట్లం: వినాయక మండపాల వద్ద డీజే పెట్టవద్దని, డప్పులు వాడాలని ఎస్సై వెంకట్రావు పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలోని ఆర్య వైశ్య సంఘంలో గణేష్ మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు క్రియాశీలకంగా ఉంటూ ప్రభుత్వ ఆదేశానుసారం చెప్పిన విధంగా మండపాలు, శోభాయాత్రలు నిర్వహించాలన్నారు. ఉప తహసీల్దార్ సత్యనారాయణ, మసీద్ కమిటీ సదర్ యదుల్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో.. భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

దోమకొండ: వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పెరిక సంఘం హాలులో వినాయక మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్సవాల్లో ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఎస్సైలు అంజనేయులు, స్రవంతి, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ నేత అనంతరెడ్డి, బీజేపీ నేత భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శారద ఉన్నారు.

సంక్షిప్తం

ఉద్యమకారుల పోస్ట్‌కార్డు ఉద్యమం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మలిదశ ఉద్యమకారులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలలో భాగంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ పోస్ట్ కార్డులను రాహుల్ గాంధీకి పంపించారు. రాహుల్ గాంధీ స్పందించి ఉద్యమకారులను న్యాయం చేయాలని ఫోరం అధ్యక్షుడు హన్మాండ్లు మేస్త్రీ అన్నారు.

గుండ్ల చెరువు నీటి విడుదల

దోమకొండ: మండల కేంద్రంలోని గుండ్ల చెరువు తూము ద్వారా పంటలకు మంగళవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో పంటలకు నీటిని విడుదల చేస్తామని ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇరిగేషన్ డీఈ సరిత, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా భోగ్ బండార్

లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగు పెద్ద తండాలో మంగళవారం గిరిజనులు భోగ్ బండార్ ఘనంగా నిర్వహించారు. గిరిజనులుప్రతీ ఏటా ఉపవాస దీక్షలు ఐదు మంగళవారాలు ఉంటారు. చివరి రోజు జైభవాని, జై సేవాలాల్ మహారాజ్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్రమైన ఉపవాస దీక్షలు విరమించారు.

పాఠశాల రిపోర్టులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలకు సంబంధించిన రిపోర్టులు ఆన్‌లైన్‌లో సకాలంలో నమోదు చేయాలని మండల విద్యాధికారి షౌకత్‌అలీ సూచించారు. మంగళవారం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు, నోటుబుక్కులు, వర్క్‌బుక్కులు, యూనిఫామ్ తదితర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 29న మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అన్ని పాఠశాలల వారు సబ్జెక్టుల వారీగా ప్రాజెక్టులు మేళాలో ప్రదర్శించాలని సూచించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

టీఎల్ఎం మేళాకు అపూర్వ స్పందన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి టీఎల్ఎం మేళాకు అపూర్వ స్పందన లభించింది. ఈ మేళాలో 30 పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని వారు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎం ఈవో యోసెఫ్.. మేళాలో పాల్గొన్న ఉపాధ్యాయులను అభినందించారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన ఉపాధ్యాయులకు మెమొంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు.

లంబాడా హక్కుల సాధన కోసం కృషి చేస్తాం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): లంబాడా హక్కుల సాధన కోసం కృషి చేస్తామని లంబాడా హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు రాథోడ్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలో సమితి జిల్లా అధ్యక్షుడు జాదవ్ గణేష్ నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్ ఆధ్వర్యంలో ఎన్నుకున్న కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాదవ్ శ్రావణ్, రాష్ట్ర కార్యదర్శి జాదవ్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బస్సులు రాక.. పాఠశాలకు సమయానికి వెళ్లలేక..

- నిత్యం బాన్సువాడ -బీర్కూర్ మార్గంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



దామరంచ నుంచి చించొల్లికి నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

బాన్సువాడ: బాన్సువాడ -బీర్కూర్ మార్గంలో ఆర్టీసీ బస్సులు సమయానికి రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ పాఠశాలకు ఆలస్యంగా వస్తున్నారని ఉపాధ్యాయుల మందలిస్తున్నారు. ఆర్టీసీ బస్సుపై నమ్మకం పెట్టుకోవడంతో విద్యార్థులకు నిత్యం చీవాట్లు పడుతున్నాయి. ఇటు బాన్సువాడ కళాశాలలకు, అటు బీర్కూర్‌లో పాఠశాలలు, కళాశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు రోజూ పాట్లు పడాల్సి వస్తోంది. బీర్కూర్ మండల కేంద్రంలో ఉన్న ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మండలంలోని బరంగెడ్గి, సంబాపూర్, కిష్టాపూర్, చించొల్లి, అన్నారం, దామరంచ, రైతునగర్ గ్రామాల నుంచి విద్యార్థులు వెళ్తున్నారు. బాన్సువాడలో ఉన్న కళాశాలలకు దామరంచ, కిష్టాపూర్, కొల్లూర్, నాగారం గ్రామాల చెందిన విద్యార్థులు వస్తుంటారు. బాన్సువాడ-బీర్కూర్ రూట్‌లో ఒకే బస్సు నడపుతున్నారు. అదే బస్సు బాన్సువాడకు వచ్చి బీర్కూర్‌కు వెళ్లే సరికి రెండు గంటల సమయం పడుతుంది. దీంతో ఆయా రూట్‌లలో మండల కేంద్రాలకు వెళ్లి విద్యనభ్యసించే విద్యార్థులు సమయానికి పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. దామరంచ ఉన్నత పాఠశాలకు ప్రతి రోజూ సుమారు 30 మంది విద్యార్థులు అన్నారం, చించొల్లి గ్రామాల నుంచి నడుచుకుంటూ వెళ్తున్నారు. కొందరు విద్యార్థులు నడుచుకుంటూ వెళ్తే మరికొందరు విద్యార్థులు పాఠశాలకు సమయం దాటిందంటూ ఇంటిముఖం పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బాన్సువాడ-బీర్కూర్ రూట్‌లో అదనంగా బస్సులు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తీసుకున్న రుణాలను చెల్లించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బ్యాంకు రుణాలను వెంటనే చెల్లించాలని ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్ సూచించారు. బంజర, ఆత్మకూర్, గోలిలింగాల గ్రామాల్లో బకాయి రుణాల వసూళ్ల కోసం మంగళవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకేపీ సిబ్బంది గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి రుణ బకాయిలను తొందరగా చెల్లించాలని చెప్పారు. కాగా బంజరలో రూ.10 వేలు, ఆత్మకూర్‌లో రూ.5 వేలు, గోలిలింగాలలో రూ.10,453 వసూలు చేసినట్లు ఏపీఎం తెలిపారు. బకాయి రుణాలను వెంటనే చెల్లించి కొత్త రుణాలు పొందాలని ఆయన చెప్పారు. సీసీలు దత్తు, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, వీవోఏలు రాజు, రమణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తమకు రావాల్సిన బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో విధులు నిర్వహించే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది మంగళవారం ప్రిన్సిపాల్ రాంప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పాఠశాల బయట ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు గత సంవత్సరం ఏప్రిల్ నెలకు సంబంధించిన వేతనంతోపాటు ఈ యేడాది జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన వేతనాలు రావాల్సి ఉందన్నారు. వేతనాలు సకాలంలో రాకపోవడం వల్ల కుటుంబపోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు చెప్పారు.

ఆవాస ప్రాంత పాఠశాలను ఏర్పాటు చేస్తాం

- ఎంఈవో ఆనంద్ రావు
- ఇటుక బట్టీలో 20 మంది పిల్లల గుర్తింపు

సాక్షి ఎఫెక్ట్..



ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న చిన్నారులతో ఎంఈవో ఆనందరావు

రామారెడ్డి: సాక్షి దినపత్రికలో మంగళవారం 'ఇటుక బట్టీల్లో వెట్టిచాకిరీ' శీర్షికతో ప్రచురితమైన కథనానికి విద్యా శాఖాధికారులు స్పందించారు. ఉప్పల్‌వాయి ఇటుక బట్టీలను ఎంఈవో ఆనందరావు మంగళవారం సందర్శించారు. 20 మంది బాల కార్మికులను గుర్తించారు. గతంలో డిసెంబర్, జనవరి నెలల్లో ఆవాస ప్రాంత పాఠశాలను ప్రారంభించే వారు. ప్రస్తుతం వలస కార్మికుల పిల్లలు ఉండడంతో ఆవాసం ప్రాంత పాఠశాలను ఏర్పాటు చేస్తామని ఎంఈవో ఆనందరావు తెలిపారు. హడావిడిగా ఆవాస ప్రాంత పాఠశాలను ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాల కార్మికులతో ఇన్ని రోజులు పని చేయించిన యాజమాన్యాలపై మాత్రం అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనర్హం.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



నస్రుల్లాబాద్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న దయానంద్

నస్రుల్లాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. మంగళవారం నస్రుల్లాబాద్‌లో ఆయన పర్యటించారు. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పలు సూచనలు ఇచ్చారు. ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గునిగెరి హన్మాండ్లు, పంచాయతీ కార్యదర్శి రాజేష్, కారోబారి రతన్ తదితరులు ఉన్నారు.

జుక్కల్ మండలం లొంగన్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరిగతిన చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం జుక్కల్ మండలంలోని లొంగన్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణం చేపట్టని లబ్ధిదారుల ఇళ్లను రద్దు చేస్తామన్నారు. జీపీ కార్యదర్శి పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



జిల్లా కేంద్రంలో కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



ఎల్లారెడ్డిలో..

కామారెడ్డి టౌన్/ఎల్లారెడ్డి రూరల్: రాష్ట్ర బార్ అసోసియేషన్ పిలుపు మేరకు కామారెడ్డి, ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో కామారెడ్డి, ఎల్లారెడ్డిలలో మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. కోర్టుల ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడాతూ.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టు పరిధిలో విధులలో భాగంగా కక్షిదారులతో కలిసి న్యాయవాది తన్నీరు శ్రీకాంత్ ఓ సివిల్ కేసులో కోర్టు వారంట్‌ను అమలు పరచడానికి వెళ్తుండగా కొంతమంది న్యాయవాదిపై దారుణంగా దాడి చేశారని తెలిపారు. దాడి చేసిన వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.